# నేలకొరిగిన వరి

- పంట దిగుబడి తగ్గుతుందంటూ అన్నదాతల ఆవేదన

అయిజ, నవంబర్ 17 : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పులికల్, రాజాపురం, బైనపల్లి గ్రామాల్లోని ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వరి ఈదురుగాలులు, వర్షాలతో అదునుకు వచ్చిన పంట చేలల్లో నేలవాలింది. ఇప్పటికే అక్కడక్కడా కోత దశకు వచ్చింది. 10 రోజుల్లోనే కోత కోయాల్సిన పంట నేల కొరగగా.. ధాన్యం మొలకలు వచ్చే అవకాశం ఉండడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు బోర్లు, బావుల వద్ద సాగు చేసిన వరి పంట కూడా అకాల వర్షాలకు దెబ్బతిన్నదని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ. 80వేల వరకు పెట్టామని, దిగుబడి తగ్గితే పెట్టుబడులు కూడా నష్టపోతామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



పులికల్ సమీపంలో నేలకొరిగిన వరి పంట



ఇతడి పేరు కొండా నాయక్, చిట్యాల తండా, వనపర్తి మండలం. 20 రోజుల కిందట వనపర్తి మార్కెట్‌కు 90 సంచుల సన్న వడ్లు తెచ్చాడు. అయితే, శనివారం వరకు కూడా అతని వడ్లు కొనలేదు. కారణమేమున్నది నేరుగా చెప్పడం లేదు. మార్కెట్‌లో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు మెప్మా కేంద్రంలో కొంటారన్నారు. మళ్లీ ఐకేపీ కేంద్రంలోనే సన్నాలు కొంటారన్నారు. అయితే, ఇద్దరి మధ్య రోజులు పెరుగుతున్నాయే తప్పా.. తూకం చేసే పనులు మాత్రం మొదలు కాలేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 20 రోజుల నుంచి మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడంటే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లప్రక్రియ ఎలా ఉందో ఇట్టే తెలుస్తోంది.

# నిలువు దోపిడీ

- కానరాని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటివరకు సెంటర్లపై దృష్టి సారించని ప్రభుత్వం
- రైతులను నిండా ముంచుతున్న దళారులు
- బస్తాకు 5కిలోల వరకు తరుగు
- తూనికల కొలతల్లోనూ తేడాలు
- క్వింటాపై రూ.200 వరకు అదనపు ఖర్చు
- అధికారులకు తెలిపినా చర్యలు శూన్యం



కల్లాల వద్దే తూకం చేస్తున్న హమాలీలు

లింగాల, నవంబర్ 17 : కష్టనష్టాలను ఓర్చుకొని అరకొరగా చేతికొచ్చిన పంటలను అమ్ముకుందామనుకుంటే దళారులు నిండా ముంచేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో కొనుగోళ్లు ఎక్కడా లేకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు రెండున్నర కిలోలు, క్వింటాకు 5కిలోల వరకు అధికంగా తూకం చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల దందా తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండడంతో మొక్కజొన్న రైతులు ఆగమవుతున్నారు. లింగాల మండలంలో 13వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా, క్వింటాకు రూ. 1,800 నుంచి రూ.2,400 వరకు ఉండగా, తూకాల్లో తేడాలు, 6 కిలోల తరుగు, రూ. వెయ్యికి రూ.3 కమీషన్, హమాలీ రూ.22, బస్తాకు వాహన ఖర్చు రూ.15గా మొత్తంగా క్వింటాకు దాదాపు రూ.200 వరకు నష్టపోవాల్సి వస్తున్నది.

***నిరుపయోగంగా సబ్‌మార్కెట్ యార్డు..***

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా మండల కేంద్రంలో సబ్‌మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ధాన్యం అమ్ముకోవాలంటే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేటకు తీసుకుపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయ మార్కెట్ కమిటీలో మండలానికి ఒకరు డైరెక్టర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం బస్తాకు ఒక కిలో మాత్రమే తరుగు, తేమశాతం 17శాతం మించకుండా తాలు, మట్టి పెళ్లలు చెత్తాచెదారం, నాణ్యత దృష్టిలో పెట్టుకొని తూకం వేయాల్సి ఉంటుంది. గోనెసంచి బరువు (600గ్రా)తో కలిపి బస్తాకు 50.6కిలోల తూకం వేయాల్సి ఉంటుంది. కానీ బస్తాకు మూడు కిలోల వరకు తరుగు తీయడంతో పాటు తూకాల్లో సైతం మోసాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లలో మోసాలను అరికట్టడంతో పాటు మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తే ఉపశమనం కలుగుతుందని రైతులు కోరుతున్నారు.

## రైతులను నిండా ముంచుతున్నారు..



స్థానికంగా వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ వాడుకలో లేక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇక్కడ దాదాపు ఎక్కువ శాతం మంది మొక్కజొన్న పంటను సాగు చేస్తాం. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తే రైతులను నిండా ముంచుతున్నారు. సర్కారోళ్లు కొనకపోవడంతో గత్యంతరం లేక నష్టమైనా బయట వ్యాపారులకు అమ్ముకోక తప్పడం లేదు.

*- కాట్రావత్ రాంజీనాయక్, రైతు, లింగాల*

## యార్డును అందుబాటులో తీసుకొస్తాం..



మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ సబ్ మార్కెట్ యార్డును రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తాం. దళారుల చేతుల్లో మోసపోతున్న రైతుల దుస్థితిని వ్యవసాయశాఖ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వానికి పన్ను రూపంలో వ్యాపారులు చెల్లించాల్సిన సుంకాన్ని రాబట్టేందుకు కమిటీ చర్యలు తీసుకుంటున్నది.

*- ముక్తార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్*



తూకాలు చేసి మూడు రోజులు గడిచినా తరలించని ధాన్యం బస్తాలు

# రైతుల పడిగాపులు!

- ధాన్యం విక్రయాలకు తప్పని తంటాలు
- ముందుకు సాగని కొనుగోళ్లప్రక్రియ
- కేంద్రాల్లో మొదలు పెట్టని సన్నరకం తూకం
- వనపర్తి జిల్లాలో జోరుగా వరి కోతలు
- 4 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇప్పటి వరకు రెండు కేంద్రాల ఏర్పాటు

## వెంటాడుతున్న గన్నీ బ్యాగుల కొరత

ఆయా సెంటర్ల వారీగా గన్నీ బ్యాగుల కొరత కూడా ఉత్పన్నమవుతున్నది. జిల్లా మొత్తంగా కోటి గన్నీ బ్యాగులు అవసరమైతే, కేవలం 20 లక్షల గన్నీ బ్యాగులతోనే పనులను ప్రారంభించారు. మిగిలిన బస్తాలు క్రమంగా వస్తాయని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నా.. ఇప్పటికే పలు సెంటర్లలో గన్నీ బ్యాగులు లేవని చెబుతున్నారు. కేవలం 5వేల బస్తాలు మాత్రమే ఒక్కో సెంటర్‌కు పంపిస్తున్నారు. ఇవి సక్రమంగా తూకాలు జరిగితే ఒకేరోజు పూర్తి అవుతాయని సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. వనపర్తి మార్కెట్‌లోని ఐకేపీ సెంటర్‌లో గురువారం బస్తాలు అందుబాటులో లేవు. సాయంత్రం వరకు వస్తాయని అధికారులు చెప్పినట్లు అక్కడి వీవోఏ హేమలత చెప్పారు. అలాగే అమరచింత మండలం ఈర్లదిన్నె, పామిరెడ్డిపల్లి సెంటర్లకు కేటాయించిన 5 వేల బస్తాలు అయిపోగా, ఇతర సెంటర్లమీద ఆధారపడాల్సి వచ్చింది. ఇలా ఏ సెంటర్‌లో చూసినా.. ఏదో ఒక సమస్య వెంటాడుతున్నది.



వనపర్తి మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం

వనపర్తి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. 14 మండలాల వారీగా వరి కోతలు జోరందుకున్నా.. ధాన్యం కొనుగోళ్ల పనులు వేగం పుంజుకోవడం లేదు. ముందు నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి ధాన్యం కొనుగోళ్లపైపకడ్బందీగా సమీక్షలు నిర్వహించి సమాయత్తం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పని వేగవంతం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 377 సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయినా ఇంకా అనేక సెంటర్లు తెరుచుకోలేదు. తెరుచుకున్న సెంటర్లకు సామగ్రి పంపిణీ కాలేదు. జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి శిస్తులున్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్న భారీ లక్ష్యం ఉన్నది. ఈ మేరకు అనుకున్న స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ జరగడం లేదు.

***మార్కెట్లలో పడిగాపులు..***

ధాన్యం విక్రయాల కోసం వచ్చిన రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. దొడ్డు రకాలను ఎలాగో అమ్ముకుంటున్న రైతులు, సన్నరకాలను అమ్ముకోవాలంటే తల ప్రాణం తోకకు వస్తుందని అంటున్నారు. పది, ఇరవైరోజుల తరబడి మార్కెట్‌లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు రావడంతో గందరగోళానికి గురవుతున్నారు. చాలా మంది మార్కెట్‌లో ఈ అవస్థలు చూసి ప్రైవేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారు. సర్కారు కొనుగోళ్లకన్నా ప్రైవేట్‌గానే పని సులభమవుతుందన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. పేరుకు రూ.500 బోనస్ అన్నారు.. కానీ, కొత్త నిబంధనలు పెట్టి రైతులను నిట్టనిలవునా ముంచుతున్నారన్న విమర్శలు వెలువడుతున్నాయి. రోజుల తరబడి కొనుగోళ్లు చేయక పెండింగ్‌లో పెడితే రైతులు మార్కెట్‌కు ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారు.

***తూకాల సమస్య..***

వనపర్తి మార్కెట్ యార్డులో మెప్మా, ఐకేపీ ఆధ్వర్యంలో రెండు సెంటర్లు పని చేస్తున్నాయి. అయితే, ఇక్కడికి భారీగానే ధాన్యం వస్తున్నది. ప్రైవేట్ వ్యాపారులే ఈ సెంటర్ల కంటే అధిక ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వరికి తోడుగా వేరుశనగ కూడా వస్తున్నది. ఇలా ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకుల తూకాల పనులు పూర్తయ్యాకే.. మెప్మా, ఐకేపీ సెంటర్ల పరిధిలో ధాన్యం తూకాలకు చాట కూలీలు, హమాలీలు వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో చివరి సమయంలో ఒక గంట మాత్రమే తమ సెంటర్లకు తూకాలు చేయడం కోసం రావడంతో పని వేగవంతం కావడం లేదని చెబుతున్నారు. సాయంత్రమైతే పని ముగించే వెళ్లిపోతున్నారని, ఇలా చేయడంతో తూకాలు పెండింగ్ పడి ఎక్కువ రోజులు రైతులు మార్కెట్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు.



వనపర్తి మండలం అప్పాయిపల్లి పరిధిలోని కీర్యాతండాకు చెందిన బుడ్డమ్మ దీపావళి పండుగ ముందురోజు జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు 60 బస్తాల సన్న వడ్లు తెచ్చింది. ఇక్కడ రెండు సెంటర్లున్నా.. ఏ సెంటర్‌లోనూ సక్రమంగా కొనుగోలు జరగడం లేదు. ఒకటి వనపర్తికి చెందిన మెప్మా సెంటరైతే, మరోటి చిట్యాలకు చెందిన ఐకేపీ సెంటర్. వీటిలో ముందుగా రెండు సెంటర్లలో దొడ్డు, సన్నవడ్లు కొంటారని చెప్పి మళ్లీ ఐకేపీ సెంటర్‌లోనే సన్నాలు కొంటామని చెబుతున్నారు. ఇద్దరి మధ్య బుడ్డమ్మ పది రోజుల నుంచి మార్కెట్లోనే మకాం పెట్టక తప్పలేదు.





బంగారు పతకాలు సాధించిన మిడ్‌ల్యాండ్ స్కూల్ క్రీడాకారులు, సిల్వర్ మెడల్స్‌తో క్రీడాకారులు

# అట్టహాసంగా..

- ఇంటర్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 17 : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇంటర్ రాష్ట్ర సాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 ట్రోఫీ ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్ నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్, అండర్-12 విభాగంలో మిడ్‌ల్యాండ్ స్కూల్ జడ్చర్ల క్రీడాకారులు మనోజ్ఞ, గీతాశ్రీ, సాయిదీప్, సంజన 5 బంగారు పతకాలు సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. మరో విద్యార్థి సాత్విక్ బంగారు మోడల్ అందుకోగా, శ్రీ హనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా క్రీడాకారులు అండర్-16 బ్లూ బెల్ట్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఏఆర్ అకాడమీ ఆర్గనైజర్ రవినాయక్ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రవీంద్రకుమార్, చెన్నకేశయ్య, కోటకదిర వెంకటేశ్, రాజేశ్, విజయ్,



జడ్చర్లలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

# ఘనంగా సదర్ ఉత్సవాలు

జడ్చర్ల, నవంబర్ 17 : మున్సిపాలిటీలో ఆదివారం నియోజకవర్గ యాదవసంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతులను అందంగా అలంకరించి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. ముందుగా దున్నపోతులతో విన్యాసాలు చేయించారు. ఈ ఉత్సవాలకు యాదవులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సదర్ ఉత్సవాలకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జడ్చర్ల మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, శ్రీశైలం యాదవ్, రవిశంకర్, ఇమ్మూ, గిరి యాదవ్, అశోక్‌యాదవ్, నర్సింహాయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, చెన్నకేశవులు యాదవ్, సాయిరాం ఉన్నారు.

# నేడు బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 17 : రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి సైదులు హాజరవుతారని తెలిపారు. ఆయా కులాల స్థితిగతులపై ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజలు, సలహాలు, అభ్యర్థనలు, ఆక్షేపణలను కమిషన్‌కు సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలతో అందజేసి, అభిప్రాయాలు చెప్పాలన్నారు.

## నేడు లగచర్లకు

# జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఫార్మా కంపెనీ వద్దంటూ ఆందోళనకు దిగిన గిరిజనులపై అక్రమ కేసులు బనాయించిన ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ రానున్నారు. ఇటీవల లగచర్ల రైతులపై పోలీసుల దాష్టీకం, అక్రమ అరెస్టులు, ఇతర ఘటనలపై విచారించేందుకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు వస్తుండడంతో పోలీసుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఆదివారం బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు లగచర్లలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 12గంటలకు లగచర్లకు చేరుకోనున్నారు. అనంతరం గ్రామంలో ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్న గిరిజనులతో సమావేశమవుతారు. పోలీసులు అమాయకులైన గిరిజనులను చిత్రహింసలు గురిచేసిన విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతారు. అనంతరం బాధిత రైతులతో మాట్లాడి ఘటన వివరాలను రికార్డు చేస్తారు. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న గిరిజన రైతులను పరామర్శిస్తారు. జరిగిన ఘటనపై రిమాండ్ లో ఉన్న వారిని కూడా విచారిస్తారు. దీంతో లగచర్లలో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొన్నది. కాగా, సీఎం నియోజకవర్గం కావడం.. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు పర్యటించడంతో ప్రభుత్వాధికారులు సహకరిస్తారా లేదా అనేది సందేహంగా మారింది. రైతులను ఇప్పటికే సీఎం అన్న గ్రామంలో పర్యటించి భయభ్రాంతులకు గురిచేశారని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్టీ కమిషన్ సభ్యుడి విచారణ అధికార పార్టీలో గుబులు రేపుతున్నది. అలాగే ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కూడిన బృందం కూడా పర్యటించనున్నది. మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలో బాధితులతో మాట్లాడనున్నారు. ఇటీవల ఎంపీ అరుణ లగచర్లకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రతినిధి బృందం మళ్లీ రానుండడంతో పోలీసులు అప్రమత్తమవుతున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన గ్రూప్-3
- నిమిషం నిబంధనతో పలువురు దూరం
- నేడు పేపర్-3

# సజావుగా..

మహబూబ్‌నగర్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ఉమ్మడి జిల్లాలో సజావుగా నిర్వహించారు. మొదటి రోజు 154 పరీక్షా కేంద్రాల్లో రెండు పేపర్లకు పరీక్షలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 52 కేంద్రాల్లో పేపర్-1కు 54.69 శాతం, పేపర్-2కు 54.13 శాతం మంది హాజరయ్యారు. 19,465 మందికి ఉదయం 10,646, మధ్యాహ్నం 10,538 మంది హాజరయ్యారు. వనపర్తి జిల్లాలో 31 కేంద్రాల్లో 8,312 మంది అభ్యర్థులకుగానూ పేపర్-1కు 4,612, పేపర్-2కు 4,611 మంది హాజరయ్యారు. పేపర్-1కు 55.48 శాతం, పేపర్-2కు 55.47 శాతం మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 25 కేంద్రాల్లో 8,570 మందికి గానూ పేపర్-1కు 4,789 మంది (55.88 శాతం), పేపర్-2కు 4,785 మంది (55.83 శాతం) హాజరయ్యారు. నారాయణపేట జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 4,024 మందికి గానూ ఉదయం 2,353 మంది (58.47 శాతం), మధ్యాహ్నం పరీక్షకు 2,354 మంది (58.49 శాతం) హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 33 కేంద్రాల్లో 9,478 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 53% మాత్రమే హాజరయ్యారు. దీంతో నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తెలకపల్లి ప్రాంతాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

ఇదిలా ఉండగా, కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో లోపాలు వెలుగు చూస్తున్నాయి. నిమిషం నిబంధన ఉండడంతో ఉమ్మడి జిల్లాలో పలువురు అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. దీంతో అభ్యర్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



వనపర్తిలో పరీక్షకు వెళ్తున్న అభ్యర్థిని